RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -4 సంచిక -2 02 బుధవారం సెప్టెంబర్ 2026 ఎడిటర్ లక్ష్మి నారాయణ




పేజీలు - 6 వెల రూ 5 /--

## ప్రపంచం తడబడుతున్నా..

# భారత్ దూసుకెళ్తోంది:

### -పవన్ కల్యాణ్

-తొలి త్రైమాసికంలో భారత్ జీడీపీ 7.8% వృద్ధి
-వృద్ధి దేశ ఆర్థిక బలానికి నిదర్శనమన్న పవన్
-ప్రపంచ అనిశ్చితిపై భారత్ స్థైర్యం చాటిందని వెల్లడి
-మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన పవన్ కల్యాణ్
-డిజిటల్ రంగం, మౌలిక వసతుల్లో పురోగతి ఉందని వ్యాఖ్య



## ఎప్పుడు ఎన్నికలు జరిగినా

# కూటమికి తిరుగులేదు..

### అందుకే ఆ పార్టీ భయపడుతోంది: మొగల్తూరులో చంద్రబాబు



మొగల్తూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం

ప్రజావేదిక సభలో చంద్రబాబు ప్రసంగం

స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో కోర్టుల్లో కేసులు వేస్తున్నారని ఆగ్రహం

ఏకగ్రీవాలను ప్రభుత్వమే ప్రోత్సహించిందని వెల్లడి

కానీ ఏకగ్రీవం అయితే టికెట్ ఇవ్వబోమని గొడ్డలి పార్టీ బెదిరిస్తోందని విమర్శలు

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు పెట్టినా ఎన్డీఏ కూటమికి తిరుగులేదని, అందుకే 'గొడ్డలి పార్టీ' ఓటమి భయంతో వణికిపోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో మంగళవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, లబ్ధిదారులకు పింఛన్లు అందజేసి ప్రసంగించారు. చిత్తుచిత్తుగా ఓడిపోతామనే భయంతోనే గొడ్డలి పార్టీ కోర్టుల్లో కేసులు వేస్తూ ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

- హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు
-భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు



## తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో

# భారీ ఊరట

### కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు

తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు
సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం
ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యంపై కీలక వాదనలు
పథకాల అమలుకు తొలగిన అడ్డంకులు



తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగింపునకు మార్గం సుగమమైంది.

# ఏపీకి మరో 13 నవోదయలు, రెండో ఎయిమ్స్ ఇవ్వండి:

నిర్మలా సీతారామన్‌కు ఎంపీ లింగమనేని విజ్ఞప్తి



# హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

శాంతా శ్రీరామ్ కన్ స్ట్రక్షన్స్ కేసులో రంగనాథ్‌ను కమిషనర్‌గా తొలగించాలన్న సింగిల్ బెంచ్
సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేసిన రంగనాథ్
విచారణ చేపట్టి, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సస్పెండ్ చేసిన హైకోర్టు డివిజన్ బెంచ్



హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. రంగనాథ్‌ను కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను నవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, లోతుకుంట గ్రామంలోని సర్వే నెంబర్లు 1, 2లలో ఉన్న సుమారు 40 ఎకరాల భూమిలో ఈ నెల 17న అధికారులు కూల్చివేతలు చేపట్టారు.

# పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష

### వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పక్కా ప్రణాళికలు
### అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు.



# ఎప్పుడు ఎన్నికలు జరిగినా కూటమికి తిరుగులేదు..

స్థానిక ప్రభుత్వాలు ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, అవి లేకపోతే కేంద్రం నుంచి నిధులు కూడా రావని చంద్రబాబు అన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు సర్పంచులు, వార్డు సభ్యులు ఉండటం ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో గొడవలు కాదని, ఐకమత్యమే ముఖ్యమని, అందుకే ఏకగ్రీవాలను తమ ప్రభుత్వం ప్రోత్సహించిందని గుర్తుచేశారు. కానీ గొడ్డలి పార్టీ నాయకులు మాత్రం ఏకగ్రీవం అయితే ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వమని బెదిరిస్తున్నారని విమర్శించారు. బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి తగ్గించిన ఆ పార్టీ, ఇప్పుడు తాము తిరిగి రిజర్వేషన్లు అమలు చేస్తుంటే కోర్టులకు వెళ్లి అడ్డుపడిందని మండిపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ పూర్తయ్యే వరకు ఎన్నికలు వద్దంటూ కేసులు వేయడమే వారి ఓటమి భయానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆయారాం-గయారాం రాజకీయాలకు తెరదించుతూ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో చైర్మన్, మేయర్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో ఐదేళ్ల కాలానికి తాము తీసుకొచ్చామని వివరించారు. 31 ఏళ్ల క్రితం ఇదే రోజున తాను తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశానని గుర్తు చేసుకున్న చంద్రబాబు, అప్పటి నుంచి ప్రజా చైతన్యం కోసం, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తూనే ఉన్నానని తెలిపారు. 2019 తర్వాత విధ్వంసమైన రాష్ట్రాన్ని, మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించారని, కేంద్ర సహకారంతో డబుల్ ఇంజన్ సర్కార్‌గా సమర్థవంతమైన పాలన అందిస్తున్నామని చెప్పారు. కేవలం రెండేళ్లలో సంక్షేమం కోసం రూ. 1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని, ఎన్టీఆర్ భరోసా కింద రూ. 73,507 కోట్లను పేదలకు అందించామని తెలిపారు. బటన్ నొక్కడం కాదని, ఇంటింటికీ వెళ్లి గౌరవంగా పెన్షన్ అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని, డ్వాక్రా సంఘాలతో పొదుపు ఉద్యమానికి నాంది పలికి వారిని ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. దీపం 2.0 ద్వారా ఏటా మూడు ఉచిత సిలిండర్లు, స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని గుర్తుచేశారు. వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ. 20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసి దశాబ్దాల కలకు సాకారం చేశామని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలోనూ తమ ప్రభుత్వం పరుగులు పెడుతోందని చంద్రబాబు అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు నీరందించామని, నల్లమల కొండల్లో సొరంగాలు తవ్వి మార్కాపురం చెన్నకేశవ స్వామి పాదాలకు శ్రీశైలం జలాలు చేర్చడం తన జీవితంలో మర్చిపోలేని అనుభూతినిచ్చిందని తెలిపారు. త్వరలో గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించి ఆ ప్రాంత చరిత్రను మార్చబోతున్నామని, నదుల అనుసంధానంతో రాష్ట్రంలో నీటి కష్టాలు తీరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇస్తుంటే, గొడ్డలి పార్టీ 350 కేసులు వేసి అడ్డుకుందని ఆరోపించారు. గత పాలకులు పరిశ్రమలను తరిమికొట్టి యువత భవిష్యత్తును నాశనం చేశారని, అందుకే తాము పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చెప్పారు. సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించి, ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, గొడ్డలి పార్టీ లాంటి కలుషిత రాజకీయాలను ప్రజలు కడిగేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్

హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి.
వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని ఆయన కొనియాడారు. నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర యువత విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్?లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను పొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. నూతన జాతీయ విద్యా విధానం కింద విదేశీ వర్సిటీలకు లభించిన వెసులుబాటును వినియోగించుకుంటూ, ఉన్నత విద్యా రంగంలో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటోంది.

# తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు.
సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.
అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

# పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష

ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు.
ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు.
ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే 33 వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను 'లీప్' యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపామని పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల హాజరు శాతం 98.97 శాతంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా పెంచాలని సూచించారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, ఈ బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీలకు అప్పగించాలని స్పష్టం చేశారు.

ఇంటర్ విద్యలో పురోగతి

ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని, గత ఏడాదితో పోలిస్తే సుమారు 10 వేల అడ్మిషన్లు పెరిగాయని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 'సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్' కింద ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు.
'తల్లికి వందనం' పథకం ద్వారా ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు రూ. 1051 కోట్లు అందించామని, మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా త్వరలో అందిస్తామని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ (ఆూూాూ=) ఐడీ ఇంటిగ్రేషన్ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతపై రాజీ లేదు

మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నాణ్యతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు 'లీప్' యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ అందించాలని కోరారు. అలాగే, విద్యార్థుల్లో ఒత్తిడి లేని అభ్యసన వాతావరణాన్ని కల్పించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు 'ఏఐ సమర్థ్' కార్యక్రమం చేపడుతున్నామని, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 192 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామని అధికారులు తెలిపారు.
సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల కోసం 'మిషన్ మార్చి-2026'పై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# ప్రపంచం తడబడుతున్నా. భారత్ దూసుకెళ్తోంది

భారత్ జీడీపీ 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ ఆర్థిక స్థైర్యం, విశ్వాసానికి నిదర్శనమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు కొనసాగుతున్నా భారత్ తన బలాన్ని చాటుకుందని పేర్కొన్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ మంగళవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. జీడీపీ వృద్ధి కేవలం ఒక సంఖ్య కాదని, దేశ ప్రజల సమష్టి శక్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ దేశం ముందుకు సాగుతోందన్నారు. 2014 నుంచి భారత్ ఆర్థికంగా మరింత బలపడిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. స్వయం సమృద్ధి, డిజిటల్ రంగం, మౌలిక వసతుల అభివృద్ధిలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. యువత పెద్ద కలలు కనడంతో పాటు ఆవిష్కరణలు, వ్యాపారాలు, సాంకేతిక రంగంలో ముందుకు సాగేందుకు అవకాశాలు పెరిగాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నా భారత్ అభివృద్ధి పథంలో కొనసాగుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ వేదికపై దేశానికి విశ్వసనీయత, ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. బలమైన, స్వయం సమృద్ధి, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే దేశంగా 'వికసిత్ భారత్' దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు.

# ఏపీకి మరో 13 నవోదయలు, రెండో ఎయిమ్స్ ఇవ్వండి:

ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి, వైద్య విద్యా విస్తరణను ఆకాంక్షిస్తూ జనసేన రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కేంద్ర ప్రభుత్వానికి కీలక విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొత్తగా మరో 13 జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుతో పాటు, రెండో 'ఎయిమ్స్' (ూా××మీా) మంజూరుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఆమెను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం లింగమనేని మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం 28 జిల్లాలు ఉండగా కేవలం 15 జిల్లాల్లోనే నవోదయ విద్యాలయాలు ఉన్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. గతంలో కేంద్ర మంత్రివర్గం ఐదేళ్ల కాలానికి రూ. 2,359.82 కోట్లతో దేశవ్యాప్తంగా 28 నవోదయల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ప్రాతిపదికన, ఏపీలోని మిగిలిన 13 జిల్లాల్లో జేఎన్వీల ఏర్పాటుకు దాదాపు రూ. 1,096 కోట్ల మేర నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలో రెండో ఎయిమ్స్ ఏర్పాటు అత్యంత అవసరమని పేర్కొన్నారు. 2014 విభజన తర్వాత మంగళగిరిలో ఒక ఎయిమ్స్ ఏర్పాటైనప్పటికీ, విస్తృతమైన రీతిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధనలను విస్తరించేందుకు ప్రాథమిక బడ్జెట్ కేటాయింపులతో డీపీఆర్ తయారు చేసి రెండో ఎయిమ్స్ నిర్మాణానికి మూలధన నిధులు ఇవ్వాలని కోరారు. ఈ నిర్ణయాలు 'వికసిత్ భారత్ ఏ2047', జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలకు అనుగుణంగా ఉంటాయని, కేంద్ర ప్రభుత్వం ఈ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# హైకోర్టులో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు భారీ ఊరట

ఈ చర్యను సవాలు చేస్తూ శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా గతంలో సింగిల్ జడ్జి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోర్టు ఆదేశాలను పదేపదే ఉల్లంఘించే అధికారులు చట్టబద్ధమైన పాలనకు ప్రమాదకరమని, అలాంటి వ్యక్తులు బాధ్యతాయుతమైన పదవుల్లో కొనసాగకూడదని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. గత ఐదేళ్లలో 9,290 కోర్టు ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉండగా, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఒక్క రంగనాథ్‌పైనే 63 కేసులు నమోదు కావడం అసాధారణమని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. అయితే, సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రంగనాథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తాజాగా డివిజన్ బెంచ్ ఆ తీర్పును రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# రైతు ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఒప్పందాలు వద్దు

## - భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి..
## - ఎంపీ కడియం కావ్యకు రైతు సంఘాల వినతి



వరంగల్, సెప్టెంబర్ 01 హైదరాబాద్ ఎస్టేట్: భారత్--అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసి దేశ రైతుల ప్రయోజనాలను కాపాడాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ ఎంపీ కడియం కావ్యకు వినతిపత్రం అందజేశారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విదేశీ వాణిజ్య ఒప్పందాల ప్రభావంతో దేశీయ రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం విధానాలు రూపొందించాలని కోరారు. కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు అనుకూల విధానాలను విడనాడాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 385 రోజులపాటు రైతులు ఉద్యమించారని, 736 మంది రైతు ఉద్యమకారుల త్యాగాల అనంతరం మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయించుకున్నామని గుర్తుచేశారు. రైతుల హక్కులకు భంగం కలిగించే విధానాలను మరో రూపంలో తీసుకురావద్దని కేంద్రాన్ని కోరారు. 2014 ఎన్నికల సమయంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవాలని అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు పంట ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను సబ్సిడీపై అందించి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. రైతులకు అందుబాటులో ధరలకు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల భూములను బలవంతంగా సేకరించరాదని, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు, నూతన విత్తన బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేసి కనీస వేతనాన్ని రూ.31 వేలకు నిర్ణయించాలని కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి వ్యవసాయ కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, 2006 అటవీ హక్కుల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీ కడియం కావ్యను విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జక్కుల తిరుపతి, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, అఖిల భారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు సుధమల్ల భాస్కర్, ఏఐకేకేఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లందాస్ కుమార్, ఏఐకేఎఫ్ జిల్లా నాయకుడు ఐత నగేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు బండి కుమార్ తదితరులు పాల్గొన్నారు

# రేవూరి జన్మదిన వేడుకల్లో అభిమానుల సందడి

## -ఊకల్ క్రాస్‌రోడ్డులో ఘనంగా వేడుకలు.. అభివృద్ధి ప్రస్థానాన్ని కొనియాడిన నాయకులు

గీసుకొండ, సెప్టెంబర్ 1 హైదరాబాద్ ఎస్టేట్: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు గీసుకొండ మండలంలోని ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దాడి శివ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి రేవూరి ప్రకాశ్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. పరకాల నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుమ్మనపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధితో ఈ ప్రాంతంలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. పార్కుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని, ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య మాట్లాడుతూ పరకాల మహిళా డెయిరీ ద్వారా గ్రామీణ మహిళలకు ఆదాయ అవకాశాలు లభించి ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని అన్నారు. మహిళల సాధికారతకు చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి మాట్లాడుతూ ప్రజలతో మమేకమై పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఏఎంసీ డైరెక్టర్ ఆకుల రుద్రప్రసాద్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. రైతులకు మెరుగైన సదుపాయాలతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించి మరింతకాలం ప్రజాసేవలో కొనసాగాలని



నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూసం రమేష్, కొనాయమాకుల సర్పంచ్ వజ్ర రాజు, కన్నీబోయిన యమున ప్రవీణ్, ఊకల్ సర్పంచ్ కక్కెర్ల సుభాష్, మరియపురం ఉపసర్పంచ్ బిట్ల రాజేంద్రప్రసాద్, శాయంపేట (హ) సర్పంచ్ గాలి యాకయ్య, విశ్వనాథపురం సర్పంచ్ ధరావత్ జ్యోతి, నందనాయక్‌తండా సర్పంచ్ బానోత్ వీరేందర్, అనంతారం సర్పంచ్ తాటికాయల సతీష్, ఎలుకుర్తి సర్పంచ్ జన్ను దివ్యభారతి, చంద్రాయపల్లె సర్పంచ్ ఒగ్గే మౌనిక ప్రశాంత్, మర్రి క్రాంతి, కొమ్ము శ్రీకాంత్, పత్తిపాక రవీందర్, ఎండి జావిద్, తాటికొండ నరేందర్, వరిగల రాజు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సన్న వరి బోనస్ పొందాలంటే ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

## - క్వింటాలుకు రూ.500 ప్రోత్సాహకం..
## - సెప్టెంబర్ 10లోపు విత్తనాల వివరాలు నమోదు చేసుకోవాలి

గీసుగొండ, సెప్టెంబర్ 1 హైదరాబాద్ ఎస్టేట్: సన్న వరి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ పొందాలంటే విత్తనాల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. హరిప్రసాద్ బాబు సూచించారు. సన్న వరి సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో ఈ బోనస్ అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు సెప్టెంబర్ 10లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎంపిక చేసిన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ-సోనా, సిద్ధి, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, జైశ్రీరాం రకాల సన్న వరి సాగు చేస్తున్న రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన డీలర్ వద్ద పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నంబర్‌తో హాజరై విత్తనాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. సొంత విత్తనంతో సాగు చేస్తున్న రైతులు విత్తనాల డీలర్ వద్ద నమోదు చేయించుకోవాల్సిన అవసరం లేదని, సంబంధిత రైతు వేదికలో స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియను కూడా సెప్టెంబర్ 10, 2026లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే విత్తనాల వివరాలను నమోదు చేసుకుని ప్రభుత్వం అందించే బోనస్ ప్రయోజనం పొందాలని ఏవో హరిప్రసాద్ బాబు కోరారు. డిజిటల్ పంటల సర్వేలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం. కావ్య, బి. భారత్, పి. స్మిత, పి. అఖిల, సర్వేయర్లు అనిల్, సుధాకర్, రాజు, వెంకట్, రైతులు పాల్గొన్నారు.





# చిట్యాలలో మెకానిక్ యూనియన్ నూతన మండల కమిటీ ఎన్నిక

చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలో మండల మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా మేకల సతీష్, మండల అధ్యక్షులుగా దామరశెట్టి వెంకన్న, ఉపాధ్యక్షులుగా మాటేటి రమేష్, ప్రధాన కార్యదర్శిగా గుర్రపు శ్రీధర్, ప్రచార కార్యదర్శిగా పెరుమాండ్ల సాగర్, కోశాధికారిగా తుమ్మ రమేష్ ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా వేము నూరి శ్రీనివాస్, చిన్నవేనా సంపత్, మంద ప్రదీప్, కడారి శ్రీనివాస్, అంకం రాకేష్, పోశాల కుమార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడు దామరశెట్టి వెంకన్న మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు జిల్లా అధ్యక్షులకు, మండల యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మెకానిక్ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు మూసాపూరి రమేష్తో పాటు యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వెంటనే సిపియస్ విధానాన్ని రద్దు చేయాలి...

## - పి ఆర్ టి యు తెలంగాణ.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు..రాచర్ల శ్రీనివాస్..

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సిపిఎస్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో .. పి ఆర్ టి యు తెలంగాణ జిల్లా అధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్ గారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వము ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఉన్న హామీలను వెంటనే అమలు పరచాలని ఉద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారిన సిపిఎస్ విధానము రద్దు పరచి వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరడం జరిగింది...సుదీర్ఘకాలం ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ పదవి విరమణ అనంతరం ఆత్మ గౌరవంతో ., ప్రశాంతంగా జీవించాలనే ఉద్యోగులకు జీవిత భద్రత లేకుండా మానసిక ఆందోళనలతో గురవుతున్నారని , ఒక్క నెల చట్టసభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు జీవితాంతము పెన్షన్ ఉంటుంది కానీ 40 సంవత్సరాల వరకు పనిచేసే ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం దురదృష్టకరమని., ఉద్యోగుల మానసిక ఆందోళనకు ప్రభుత్వమే కారణమని తెలియజేశారు... ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న ఆరు డిఏలు., పిఆర్సిలు వెంటనే అమలుపరిచి ఉద్యోగ ఉపాధ్యాయుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ప్రభుత్వం నిరూపించుకోవాలన్నారు...ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన బాధ్యులతో పాటు., పి ఆర్ టి యు తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల శంకర్ నేత., బాధ్యులు నరేష్, శరత్., శంకర్ మహేందర్., తదితరులు పాల్గొన్నారు...




# చిట్యాల నూతన సీఐ సతీష్‌కు ఘన సన్మానం

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

చిట్యాల, సెప్టెంబర్ 1: చిట్యాల నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన వై. సతీష్ గారిని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి గారి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ చిట్యాల మండల అధ్యక్షులు కొల్లూరి అశోక్ సీఐ సతీష్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన సతీష్‌కు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, చిట్యాల మండలంలో శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు నేరేళ్ల ఓదేలు, జేరిపోతుల ఓదేలు, దోర్నాల రాజేందర్, ఎర్ర భద్రయ్య, నేర్పటి అశోక్తో పాటు మండల నాయకులు కట్కూరి మొగిళి, సిరిపెల్లి నాగరాజు, నోముల శివశంకర్, దూడపాక రాజు, సిరిపెల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# దొరికిన మొబైల్‌ను పోలీస్ కి అప్పగించిన రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు

హైదరాబాద్ ఎస్టేట్ 1 సెప్టెంబర్

మానవతా దృక్పథంతో, దొరికిన మొబైల్ ఫోన్ దాని అసలు యజమానికి చేరాలనే మంచి ఉద్దేశంతో మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మొబైల్ ఫోన్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై జె .శ్రీధర్ మాట్లాడుతూ దొరికిన వస్తువును మన సొంతంగా భావించకుండా, అది ఎవరిదో గుర్తించి వారికి అందేలా చేయడం నిజమైన మానవత్వానికి నిదర్శనం. రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు చూపించిన నిజాయితీ, బాధ్యతాయుతమైన వైఖరి అభినందనీయం. సమాజంలో ప్రతి ఒక్కరూ ఇలాంటి మంచి ఆలోచనతో ముందుకు వస్తే ప్రజల్లో పరస్పర నమ్మకం మరింత పెరుగుతుంది. పోలీసులకు మొబైల్‌ను అప్పగించడం ద్వారా బాధితుడికి న్యాయం చేయాలనే వారి మంచి మనసు స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి సేవా భావాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి.” సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రామకృష్ణాపూర్, జె శ్రీధర్ తెలిపారు



# గిరిజన బిడ్డ శిరీషకు న్యాయం చేయాలి

## -- నిందితుడిని ఎన్కౌంటర్ శిక్షించాలి: రాజేష్ ఏబీవీపీ డిమాండ్





హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 01:)లిఅఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మహేశ్వరం శాఖ ఆధ్వర్యంలో గిరిజన బిడ్డ శిరీషకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిందితుడి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వనవాసి కన్వీనర్ రాజేష్ మాట్లాడుతూ, గిరిజన యువతి శిరీషపై జరిగిన అత్యంత దారుణ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యుడైన నిందితుడిపై చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకొని త్వరితగతిన శిక్ష అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజేష్ మాట్లాడుతూ, "గిరిజన బిడ్డలు ఈ సమాజంలో భద్రంగా తిరగకూడదా? గిరిజనులు బాగుపడకూడదా?" అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజనులపై జరుగుతున్న దారుణాలను అరికట్టడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని కోరారు. అలాగే, ఈ ఘటనలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు నగర్ కార్యదశ్ ప్రణీత్ సయిద్, అబ్లీష, రోహిత్,సాయి కార్తీక్, చింటూ,శృతి నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఏబీవీపీ డిమాండ్లు:

శిరీష హత్య కేసులో నిందితుడిపై అత్యంత కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

బాధిత కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలి.

గిరిజన మహిళలు, విద్యార్థుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

జై భారత్ -- జై వనవాసి -- జై ఏబీవీపీ



# సి.పి.ఎస్. రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలి

### - 'పెన్షన్ ద్రోహ దినం'గా టీజీఈజేఏసీ నిరసన..

### - గీసుగొండలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల ఆందోళన

గీసుగొండ, సెప్టెంబర్ 1 హైదరాబాద్ ఎస్టేట్:

సి.పి.ఎస్.ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర టీజీఈజేఏసీ పిలుపు మేరకు గీసుగొండ మండలంలో ఉద్యోగులు మంగళవారం నిరసన చేపట్టారు. సెప్టెంబర్ 1ని 'పెన్షన్ ద్రోహ దినం'గా పాటిస్తూ భోజన విరామ సమయంలో గీసుగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద, కొనాయమాకుల క్లస్టర్ రైతు వేదిక వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ సి.పి.ఎస్.ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం ద్వారా ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. పెన్షన్ హక్కులకు సంబంధించిన తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు పెన్షన్ అంశంపై తమ నిరసనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గీసుగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఉద్యోగులు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు

హైదరాబాద్ ఎస్టేట్ 01 సెప్టెంబర్

రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ కె.శ్రీనివాస్, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నాగేంద్ర గౌడ్, రమేష్, ఏఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్, ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్నికల ప్రక్రియ, ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నోడల్ అధికారి, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ఎన్నికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 70 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ వడ్లకొండ నవీన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్‌పై 5 ఓట్ల ఆధిక్యంతో రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం: అధ్యక్షుడు: వి. నవీన్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ 291, శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్, ఉపాధ్యక్షులు: ఎన్. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, సైబర్ క్రైమ్ విభాగం; ఎం. తిరుపతి, ఏఎస్ఐ, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్, ప్రధానకార్యదర్శి: జె. అంజనేయులు, సబ్‌ఇన్‌స్పెక్టర్, సీసీబీ రామగుండం, సంయుక్త కార్యదర్శి: కె. ఓంకార్, కానిస్టేబుల్, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్, సంస్థాగత కార్యదర్శి: డి. వినోద్ బాబు, కానిస్టేబుల్, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్, కోశాధికారి: టి. సుందర్ సింగ్, కానిస్టేబుల్, ధర్మారం పోలీస్ స్టేషన్, కార్యనిర్వాహక సభ్యులు: ఎం.డి. రిజ్వాన్ షా ఖాన్, హెడ్ కానిస్టేబుల్ 714, సీఎస్బీ రామగుండం; డి. అనిల్ కుమార్, కానిస్టేబుల్, సంత్‌నగర్ పోలీస్ స్టేషన్; సి.హెచ్. దేవరాజ్, కానిస్టేబుల్, సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్, కార్యవర్గ సభ్యులు: ఎం.రాజిత, మహిళా పోలీస్ కానిస్టేబుల్, పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్; ఎ.కపిల్, ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్, సీఏఆర్ రామగుండం; డి. రాజం, ఏఆర్ఎస్ఐ, సీఏఆర్ బెల్లంపల్లి, ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కలను అందజేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం విజయం సాధించిన



అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారికంగా ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం ప్రతినిధులు తక్షణమే స్పందించాలని సూచించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, వారి సంక్షేమం కోసం కృషి చేయాలని సీపీ ఆకాంక్షించారు. సంఘం బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేస్తూ పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు

# మహేశ్వరం మండల భారత్ ఫ్యూచర్ సిటీ జేఏసీ రిలే నిరాహార 2వ రోజు దీక్ష కు సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ నాయకులు

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 01:)



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను భారత్ ఫ్యూచర్ సిటీలో కలపాలని రిలే నిరాహార దీక్ష చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ జాయింట్ యాక్షన్ కమిటీ సంఘీభావం తెలిపిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకి ఈశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారు గాల్ల లాజర్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, సీనియర్ నాయకులు గదగూటి జంగయ్య ముదిరాజ్,మాజీ ఉపసర్పంచ్లు కర్రోళ్ల రాములు ముదిరాజ్, దోమ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్, మైనారిటీ డిపార్ట్మెంట్ మండల చైర్మన్ మహమ్మద్ ఇర్షాద్, మహేశ్వరం గ్రామ 10 వ వార్డు ఇన్చార్జ్ ముదిరాజ్ సంఘం గ్రామ ఉపాధ్యక్షులు కాకి మల్లేష్ ముదిరాజ్ , పినమని శ్రీకాంత్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు

# కేకే ఓసిపి ముంపు ప్రాంత వాసులకు రెండు గుంటల స్థలమును కేటాయించిన సింగరేణి యాజమాన్యం

హైదరాబాద్ ఎస్టేట్ 01సెప్టెంబర్

మంచిర్యాల జిల్లా మందమర్రి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో జనరల్ మేనేజర్ ఎన్ . రాధాకృష్ణ ఆగష్టు 2026 మాసానికి సంబంధించిన ఉత్పత్తి, ఉత్పాదకత మరియు కార్మిక సంక్షేమ కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

సందర్భంగా జి.ఎం చీ.రాధాకృష్ణ మాట్లాడుతూ, గడిచిన ఆగస్టు మాసంలో మందమర్రి ఏరియా 105% బొగ్గు ఉత్పత్తి సాధించడంతో పాటు 102% ఓవర్ బర్డెన్ (ాదీ) తొలగింపు లక్ష్యాన్ని పూర్తి చేసిందని వివరించారు. కేకే ఓసిపి ముంపు ప్రాంతమైన దుబ్బగూడం వాసులకు సింగరేణి ?ఆర్ అండ్ ఆర్ కాలనీలో రెండు గుంటల స్థలమును సింగరేణి యాజమాన్యం ఇవ్వడం జరిగింది. ఆ యొక్క ఆర్ అండ్ ఆర్ కాలనీలో మొదటి నూతన గృహప్రవేశం ఈ మధ్యనే జరిగినది అలాగే అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా పరిశీలించినము. అలాగే కొద్ది రోజుల్లో అక్కడ కొత్త కాలనీ ఏర్పడబోతుంది. అండర్ గ్రౌండ్ (అంతర్గత) గనులలో ఉద్యోగుల గైర్హాజరు వలన ఉత్పత్తికి కొంత విఘాతం కలుగకుండ, ఈ సమస్యను అధిగమించడానికి యూనియన్ నాయకులతో కలిసి



సమన్వయంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఎప్పుడు ఎప్పుడు అని ఎదురుచూస్తున్న రామకృష్ణాపురం ఓసిపి అటవీ శాఖ పరిమిషన్ల ఫైనల్ క్లియరెన్స్ లో ఉన్నవి అని తెలిపారు. ఉద్యోగులు మరియు అధికారుల సహాయ సహకారాలతో అండర్ గ్రౌండ్ గనులలో 100% ఉత్పత్తి సాధించేలా, అలాగే ప్రతి ఒక్కరూ రక్షణ (ఘుటవ్ఎ) మరియు నాణ్యత (ఉఋశ్రీఱఎ) తో కూడిన ఉత్పత్తిని సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ?ప్రతి నెలా వెల్ఫేర్ ఆఫీసర్లు మరియు పర్సనల్ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామని, సింగరేణి ఉద్యోగులకు సీ.ఎం.పి.ఎఫ్ మరియు పెన్షన్ సేవలను ఎలాంటి జాప్యం లేకుండా, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం అంతేకాకుండా కొత్తగా పెన్షన్ క్లెయిమ్‌లను అత్యంత వేగంగా పూర్తి చేసేందుకు 'ప్రయాస్' అనే నూతన పద్ధతిని అమలులోకి తెచ్చారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు క్లెయిమ్‌లన్నింటినీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ 'జీరో పెండింగ్' లక్ష్యాన్ని చేరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. గనులలో క్యాంటీన్ వంటి పలు అంశాలపై ఎలాంటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఐ+వీ (పర్సనల్) సిహెచ్. అశోక్, ఐ+వీ (×జుఐ) కిరణ్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలి టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి



( ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 01:)

మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని డిమాండ్ చేస్తూ మహేశ్వరం మండల ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని అన్నారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటు ద్వారా మహేశ్వరం ప్రాంతానికి పెద్ద ఎత్తున అభివృద్ధి అవకాశాలు లభించనున్న నేపథ్యంలో, మండలంలోని కొన్ని గ్రామాలను మాత్రమే కాకుండా మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను సమగ్రంగా ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ జేఏసీ అధ్యక్షులు రఘుపతి, కాకి ఈశ్వర్ ముదిరాజ్,చిక్కుళ్ల శివప్రసాద్,దత్తు, జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# "సూర్యగిరి ఎల్లమ్మ టెంపుల్ చైర్మన్ రెడ్డిగల్లా రత్నం"

# ఎల్లమ్మ నామస్మరణతో పులకించిన సూర్యగిరి ఎల్లమ్మ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 1:-

రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం నియోజకవర్గంలోని రావిరాల గ్రామంలో సూర్యగిరి ఎల్లమ్మ బోనాల జాతర భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక సందడితో అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సూర్యగిరి పరిసరాలు భక్తజన సంద్రంగా మారాయి. ఆలయ ధర్మకర్తలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. బోనాల సందర్భంగా శివశక్తులు ప్రత్యేక వేషధారణలో ఆటలు, పాటలతో అలరించగా.. డప్పు దరువులు, మేళతాళాల నడుమ భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకుని ఆలయానికి చేరుకుని ఎల్లమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. సుమారు 300 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి జాతర మొత్తం నిరంతరం పర్యవేక్షించారు. భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు, వాహనాల కోసం విశాలమైన పార్కింగ్ సదుపాయం కల్పించారు. జాతర ప్రాంగణం, ఆలయ పరిసరాలు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన రహదారుల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతను పర్యవేక్షించారు. ఆలయ ధర్మకర్తలు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయడంతో ఎల్లమ్మ బోనాల జాతర ప్రశాంతంగా, విజయవంతంగా జరిగింది. దీంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తూ ఆలయ నిర్వాహకులు, పోలీసు అధికారులకు అభినందనలు తెలిపారు



# సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి:

**- రౌండ్ టేబుల్ సమావేశంలో డిమాండ్**






హైదరాబాద్, సెప్టెంబర్ 01:
స్వాతంత్ర్య సమరయోధురాలు, తెలంగాణ తొలితరం ఉద్యమనేత శ్రీమతి సంగం లక్ష్మీబాయి సేవలను గుర్తించి, సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ఆమె పేరు పెట్టాలని పలువురు వక్తలు, సామాజిక సంఘాల నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'మన ఆలోచన సాధన సమితి' వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్ రావు, 'తెలంగాణ స్వాభిమాన్ పరిషత్' వ్యవస్థాపకుడు వినయ్ కుమార్ యాదవ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నిజాం నిరంకుశత్వాన్ని, బ్రిటిష్ పాలనను ఎదిరించి జైలు జీవితం గడిపిన ధీర వనిత సంగం లక్ష్మీబాయి అని కొనియాడారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, ఆచార్య వినోబా భావేతో కలిసి భూదాన్ ఉద్యమంలో నడిచిన ఆమె.. అణగారిన, వితంతు మహిళల అభ్యున్నతి కోసం 'ఇందిరా సేవా సదన్', విద్యార్థుల కోసం విద్యాపీఠాన్ని స్థాపించిన మహనీయురాలని గుర్తుచేశారు. హైదరాబాద్ రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, ఉప విద్యాశాఖ మంత్రిగా, అనంతరం మూడు పర్యాయాలు లోక్‌సభ సభ్యురాలిగా సేవలందించిన 'తెలంగాణ సావిత్రిబాయి పూలే' సంగం లక్ష్మీబాయి చరిత్రను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి లక్ష్మీబాయి పేరు పెట్టడంతో పాటు రాష్ట్ర సచివాలయం లేదా అసెంబ్లీ ప్రాంగణంలో ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో బీసీ, బహుజన, సామాజిక సంఘాలను కలుపుకొని ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, 'మాస్' అధికార ప్రతినిధి మంగిళిపల్లి శంకర్ గంగపుత్ర, ఉపాధ్యక్షురాలు దుర్గారాణి రజక, బీసీ ఉద్యమకారుడు ఒట్టె జానయ్య యాదవ్, బొంగు ప్రసాద్ గౌడ్, చామకూర రాజు, పృధ్వీరాజ్ యాదవ్, నీరజాగౌడ్, శ్రీనివాస్ యాదవ్, గోపీ రజక, కైరంకొండ నర్సింగ్ రావు, తాడెం రమేష్ కుమార్, తొలివెలుగు రఘు, కాళోజీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి లోని బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ నాయకుల దాడిని ఖండించిన కందుకూరు మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి సెప్టెంబర్ 01:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రంలో...అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అన్నారు ఈరోజు రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు కందుకూరు మండల పరిధిలోని చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు తేరటి లక్ష్మణ్ ముదిరాజ్ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు పల్లె కృష్ణగౌడ్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు జిల్లా నాయకులు జిట్టా రాజేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు దాడి చేయాల్సింది బిజెపి పార్టీ కార్యాలయం పై కాదు అని వృద్ధులకు 4000 పింఛన్ ఇస్తానని మోసం చేసిన రేవంత్ రెడ్డి ఇంటి పై దాడి చేయాలని అన్నారు అదే కాకుండా రెండుసార్లు రైతుబంధు కాదు మూడుసార్లు రైతుబంధు ఇవ్వాలని ఇవ్వకుండా రైతులను మోసం చేసిన రేవంత్ రెడ్డి పార్టీ కార్యాలయాన్ని ముట్టడి చేయాలని అదేవిధంగా విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడి చేయాలని అన్నారు కాంగ్రెస్ పార్టీ నాయకులు గూండాల్లాగా వ్యవహరిస్తున్నారని ప్రజాస్వామ్యంలో దాడులకు బెదిరింపులకు తావు లేదు అని ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం సహజం అయితే పార్టీ కార్యాలయాలపై దాడి పరిష్కారం కాదని అన్నారు ఎమర్జెన్సీ ముగిసి దశాబ్దాలు గడిచినా ప్రశ్నించే గొంతులను అలచివేయాలనే ధోరణి ఎక్కడ కనిపించినా దాని ప్రజాస్వామ్య వాదులంతా వ్యతిరికించాలని భావజాలాన్ని భావజాలంతోనే ఎదుర్కోవాలి దాడులతో కాదు అని అన్నారు రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు ఓటు బ్యాంకుతో మీకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లబోలు నర్సింహారెడ్డి ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఏగ్గిడి సత్తయ్య మండల ప్రధాన కార్యదర్శులు చిలుకల రఘునందన్ ప్రభాకర్ మాసన్న వెంకట్ రెడ్డి సర్పంచ్ సంగం కందుకూరు మండల అధ్యక్షుడు రమేష్ దాసర్లపల్లి సర్పంచ్ బాలరాజ్ మండల నాయకులు దయాకర్ ముదిరాజ్ విమోచన నాయకులు సామ సురేందర్ రెడ్డి వరుణ్ జైత్వారం ఉప సర్పంచ్ నవీన్ ఆకుల మేళాల ఉపసర్పంచ్ సురేష్ కళ్లెం చెన్నారెడ్డి కళ్లెం సుధాకర్ రెడ్డి సామల దయాకర్ రెడ్డి ఉప సర్పంచ్ రాములు మల్లేష్ ఆంజనేయులు గౌడ్ సురేష్ ప్రవీణ్ పాండు శ్రీశైలం గణేష్ చంద్రయ్య నరసింహ ఆంజనేయులు యాదవ్ మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు







## నూతన జడ్పీ సీఈఓను కలిసిన పంచాయతీ కార్యదర్శులు

**- వసంతకు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఫోరం ప్రతినిధులు**

గీసుకొండ, సెప్టెంబర్ 01 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ జిల్లా పరిషత్ నూతన ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎన్. వసంతను జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఫోరం జిల్లా అధ్యక్షుడు యాకుబ్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమెను కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాకుబ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి, గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారంలో పంచాయతీ కార్యదర్శులు పూర్తి సహకారంతో పనిచేస్తారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన సీఈఓ ఎన్. వసంత అనుభవం జిల్లా, గ్రామీణాభివృద్ధికి మరింత దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్. వసంత మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని తెలిపారు. ప్రజలకు స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం నాయకులు పోలు రాజేంద్ర ప్రసాద్, రాంబాబు, వినోద్, మహేందర్, ఆకుల పృథ్వి, మురళీకృష్ణ, దేవేందర్‌తో పాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే KR నాగరాజు

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
రాష్ట్రంలో ప్రతి అర్హుడికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు అన్నారు.మంగళవారం ఎర్రగట్టుగుట్ట మీ= గార్డెన్ లో 65,66,1,2,55 డివిజన్లుకు చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను ఎంపీ కడియం కావ్య గారితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...గతంలో ఎన్నడూ లేని విధంగా రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు.ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గారు అన్నారు. గుడిసెలు లేని గ్రామాలను చూడాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి లక్ష్యమని తెలిపారు. ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసే వ్యక్తులను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. ప్రతి అర్హుడికి దశలవారీగా ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే నాగరాజు గారు స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో 65 డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్,66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్,1వ డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము,2వ డివిజన్ అధ్యక్షులు పుట్ట తిరుపతి,55వ డివిజన్ అధ్యక్షులు గడ్డం అరుణ్,66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్, హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి వెంకటరెడ్డి,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, డీసీసీ జనరల్ సెక్రెటరీ మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, వంగపహాడ్ గ్రాజూ చైర్మన్ రాజేష్ గౌడ్, మండల అధ్యక్షులు అశోక్ కుమార్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాకేష్ రెడ్డి, మహిళ అధ్యక్షురాలు పూలక్క,ఉపాధ్యక్షురాలు స్వాతి,2వ డివిజన్ మాజీ అధ్యక్షులు పొన్నాల రఘు, సీనియర్ నాయకులు,గ్రామ శాఖ అధ్యక్షులు,సర్పంచులు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు






## విద్యా ప్రమాణాలపై ప్రత్యేక నజర్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 1:-
చౌదరిగూడెం: ప్రభుత్వ పాఠశాలలు, ప్రీ-ప్రైమరీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంచేందుకు అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) డాక్టర్ కే. కిరణ్మయి సూచించారు. మంగళవారం చౌదరిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రీ-ప్రైమరీ కేంద్రాలను ఆమె క్షేత్రస్థాయిలో సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, బోధనా విధానం, అభ్యసన సామర్థ్యం, మౌలిక వసతులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు, విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల అభ్యసన స్థాయిపై వివరాలు సేకరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించాలని, ప్రతి విద్యార్థి ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రీ-ప్రైమరీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న బోధన, ఆటలు, అభ్యసన కార్యకలాపాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. చిన్నారుల వయస్సుకు తగిన విధంగా సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.అనంతరం ఇంద్రానగర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామ సభకు డాక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. గ్రామాభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతులపై సమీక్షించారు. ప్రజలు తెలిపిన సమస్యలను అధికారులు నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి పనులను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

# పాత పెన్షన్ కోసం ఉద్యోగుల పోరుబాట

**-"సెప్టెంబర్ 10న హైదరాబాద్ తరలిరావాలని పిలుపు"**




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 1:-
కొంగరకలాన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద నిర్వహించిన నిరసనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కార్యాచరణ సమితి చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం ఉద్యోగుల భవిష్యత్‌కు భద్రత లేకుండా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.
జిల్లా కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మాట తప్పకుండా ఉద్యోగుల ఆకాంక్షను నెరవేర్చాలని అన్నారు.
రాష్ట్ర కార్యాచరణలో భాగంగా సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'హైదరాబాద్ తరలింపు కార్యక్రమానికి' ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనేష్ కుమార్ నోరి, గోపాల్, ప్రవీణ్, శాంతిశ్రీ, సుధాకర్, రాజేష్, బల్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీ గుప్త సేవా స్ఫూర్తితో ముందుకెళ్లాలి-: కొండ్లె మల్లికార్జున్

కాచిగూడ, సెప్టెంబర్ 01:
సమాజ శ్రేయస్సుకు ఆర్యవైశ్య సంఘం విశేష సేవలందిస్తోందని, స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ కేసీ గుప్త చూపిన సేవా మార్గంలో పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని కాచిగూడ వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్ పిలుపునిచ్చారు.
కేసీ గుప్త 107వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక జైన్ భవన్‌లో ఇసామియాబజార్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్త అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్లికార్జున్.. కేసీ గుప్త చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు పంపిణీ చేయడంతో పాటు నిరుపేదలకు నిత్యావసర సరుకులు, అవసరమైన పరికరాలు, ఆర్థిక సాయాన్ని అందజేశారు.
ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కొమిరిశెట్టి అనిల్ కుమార్, లక్ష్మణ్, వెంకట గోపాలకృష్ణ, వెంకటేష్, రామకృష్ణ, రఘువీర్, మహేష్, నిఖిలేశ్వర్, శ్రీధర్, రవికుమార్, గుండా విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ ఎస్టేట్



# మట్టిలో మాణిక్యం...

# పరుగులో బంగారు పతకం!

## 50 ఏళ్ల వయసులో 42 కి.మీ. ఫుల్ మారథాన్ పూర్తి చేసిన దబ్బేటి రాములు గౌడ్



**హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతీదీ ఎల్బీనగర్**

గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్ర స్థాయి మారథాన్‌లో సత్తా చాటుతూ... ఆరోగ్యమే మహాభాగ్యం అంటూ యువతకు ఆదర్శంగా నిలిచిన రాములు గౌడ్

హైదరాబాద్: వయసు అంకె మాత్రమే... సంకల్పానికి వయసు ఉండదని నిరూపించారు గ్రామీణ వాసి దబ్బేటి రాములు గౌడ్. జీవితంలో ఎన్నో బాధ్యతలు, పరిమితులు ఉన్నప్పటికీ క్రీడలపై ఉన్న ఆసక్తిని వదులుకోకుండా నిరంతర సాధనతో పరుగుల ప్రపంచంలో మరో మైలురాయిని అధిగమించారు.

చీవీణజ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మారథాన్‌లో పాల్గొన్న రాములు గౌడ్ 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేసి బంగారు పతకం సాధించారు. నిర్ణీత సమయంలో 4 గంటల 47 నిమిషాల్లో మారథాన్‌ను పూర్తి చేసి తన ప్రతిభను చాటుకున్నారు. ఈ విజయంతో మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు.

**గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్ర స్థాయి వరకు...**

సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన రాములు గౌడ్‌కు ఈ విజయం ఒక్కరోజులో దక్కింది కాదు. క్రమశిక్షణ, పట్టుదల, ప్రతిరోజూ సాధన, ఆరోగ్యంపై శ్రద్ధే ఆయన విజయానికి బలమైన పునాది. అవకాశాలు తక్కువగా ఉన్నా ఆత్మవిశ్వాసం ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని ఆయన ప్రయాణం చాటి చెబుతోంది.

గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయి క్రీడా వేదికపై పాల్గొని 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌ను పూర్తి చేసి బంగారు పతకం సాధించడం అభినందనీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. రాములు గౌడ్ విజయం గ్రామీణ యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

**50 ఏళ్ల వయసులో యువతతో పోటీ!**

సాధారణంగా వయసు పెరిగే కొద్దీ శారీరక వ్యాయామాలకు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తుంది. కానీ రాములు గౌడ్ అందుకు పూర్తి భిన్నమైన ఉదాహరణగా నిలిచారు. 50 సంవత్సరాల వయసులోనూ 42 కిలోమీటర్లు పరుగెత్తి యువతతో పోటీ పడుతూ మారథాన్‌ను పూర్తి చేయడం ఆయన సంకల్ప బలానికి నిదర్శనం.



వయసు కేవలం శరీరానికి సంబంధించిన సంఖ్య మాత్రమేనని, మనసులో ఉత్సాహం, లక్ష్యం ఉంటే ఏ వయసులోనైనా కొత్త విజయాలను సాధించవచ్చని ఆయన నిరూపించారు.

**"ఆరోగ్యమే మహాభాగ్యం"...**

తన విజయానంతరం రాములు గౌడ్ మాట్లాడుతూ, "ఆరోగ్యమే మహాభాగ్యం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి. ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామం, నడక, పరుగు, క్రీడలకు కేటాయించాలి. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల వైపు అడుగులు వేయాలి" అని పిలుపునిచ్చారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. చదువు, ఉద్యోగం, ఇతర బాధ్యతలతో పాటు శారీరక దృఢత్వానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**గ్రామ యువతకు స్ఫూర్తిదాయక ఆదర్శం**

రాములు గౌడ్ సాధించిన ఈ విజయం కేవలం ఆయన వ్యక్తిగత విజయంగా మాత్రమే చూడలేమని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవ లేదని, సరైన సంకల్పం ఉంటే గ్రామం నుంచి కూడా రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి వేదికలపై రాణించవచ్చని ఆయన నిరూపించారు.

ప్రత్యేకంగా గ్రామీణ యువతకు ఆయన ప్రయాణం ఒక స్ఫూర్తిదాయక సందేశం. ఖరీదైన సదుపాయాలు లేకపోయినా క్రమం తప్పకుండా సాధన చేస్తే శారీరక సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయాన్ని అందుకోవచ్చని ఆయన చూపించారు.

**పరుగుతో ఆరోగ్య సందేశం...**

రాములు గౌడ్ సాధించిన 42 కిలోమీటర్ల పరుగు కేవలం ఒక క్రీడా విజయమే కాదు... సమాజానికి ఆరోగ్యంపై ఇచ్చిన ఒక సందేశం కూడా. నేటి వేగవంతమైన జీవనశైలిలో వ్యాయామానికి సమయం కేటాయించకపోవడం, చెడు ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం వంటి కారణాలతో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి.

ఈ నేపథ్యంలో "రోజులో కొంత సమయం మన ఆరోగ్యం కోసం కేటాయించాలి" అనే రాములు గౌడ్ సందేశం ప్రతి ఒక్కరికీ ఆచరణీయమైనది.



**అభినందనల వెల్లువ**

42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌ను 4 గంటల 47 నిమిషాల్లో విజయవంతంగా పూర్తి చేసి బంగారు పతకం సాధించిన రాములు గౌడ్‌ను పలువురు అభినందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి తన ప్రతిభను రాష్ట్ర స్థాయిలో చాటుకున్న ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**రాములు గౌడ్ విజయం ఒక పతకం మాత్రమే కాదు... గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభకు ప్రతీక.**

**వయసు అడ్డంకి కాదు... సంకల్పమే బలం.**

**గ్రామం పరిమితి కాదు... ప్రతిభకు హద్దులు లేవు.**

**పరుగు కేవలం పోటీ కాదు... ఆరోగ్యకరమైన జీవితానికి పునాది.**

50 ఏళ్ల వయసులో 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌ను పూర్తి చేసిన దబ్బేటి రాములు గౌడ్ ఈ మూడు సందేశాలను తన విజయంతో సమాజానికి చాటి చెప్పారు. ఆయన అడుగుజాడల్లో మరెంతో మంది యువత, క్రీడాకారులు ముందుకు సాగాలని కోరుకుందాం.

---

# సూర్యగిరి ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కేఎల్ఆర్

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని కోరిన నాయకులు

( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రసన్నది కృష్ణాచారి సెప్టెంబర్ 01:)

మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న లక్ష్మారెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు పాల్గొన్న తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మహేశ్వరం మండలం తుక్కుగూడ డివిజన్ రావిర్యాల గ్రామం సూర్యగిరి ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న లక్ష్మారెడ్డితో కలిసి పాల్గొన్నారు. సూర్యగిరి ఎల్లమ్మ తల్లి సన్నిధిలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఎంతో ఆనందంగా ఉందని, ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా అమ్మవారిని





ప్రార్థించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు తెలంగాణలో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉంది. గ్రామదేవతగా ఎల్లమ్మ తల్లిని కొలిచే భక్తుల విశ్వాసం తరతరాలుగా కొనసాగుతోంది...ప్రజల విశ్వాసాలకు, మన సంప్రదాయాలకు గౌరవం ఇస్తూ ఎల్లమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజా సంక్షేమం మరింత బలోపేతం కావాలని కోరుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి అన్నారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, ఆరోగ్యం,ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఎల్లమ్మ తల్లిని ప్రార్థిస్తున్నాము.

ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలందరికీ శాంతి, సంతోషం, సుభిక్షం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాన్నారు.

ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గౌడ భవనానికి ఎమ్మెల్యే భరోసా

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 1:-

ఇబ్రహీంపట్నం మండలం, రాయపోల్ గ్రామ గౌడ సంఘం భవన పునర్నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి భరోసా కల్పించారు. భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోవడంతో కొంతకాలంగా వినియోగానికి నోచుకోకుండా ఉన్న పరిస్థితిని గౌడ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ఈ మేరకు గౌడ సంఘం నాయకులు మంగళవారం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యను వివరించారు. అసంపూర్తిగా మిగిలిన భవనాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. భవనం పూర్తయితే సంఘం కార్యకలాపాలు నిర్వహించుకోవడంతో పాటు గౌడ సామాజిక వర్గానికి వివిధ కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. భవన నిర్మాణ పనులు ముందుకు సాగేందుకు రూ.10 లక్షల నిధులు మంజూరు చేయాలని సంఘం నాయకులు ఎమ్మెల్యేను కోరారు. సమస్యను సానుకూలంగా పరిశీలించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, గౌడ సంఘం భవన పునర్నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అవసరమైన నిధుల సమీకరణకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే స్పందనపై గౌడ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. భవనం పూర్తయితే గ్రామంలోని గౌడ సంఘం సభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.



# రాహుల్ గాంధీపై అక్రమ ఎఫ్ఐఆర్, ఖర్గేకు జరిగిన అవమానానికి నిరసనగా హనుమకొండలో కాంగ్రెస్ ధర్నా

హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ

హనుమకొండ:ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా డీసీసీ (ఱజజ) అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సూచన మేరకు హనుమకొండ చౌరస్తాలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద భారీ ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు.



ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అక్రమంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.అదేవిధంగా, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న సభా వేదికను "శుద్ధి" చేస్తున్నామనే నెపంతో, దళితుడైన ఆయనను తీవ్రంగా అవమానించిన బీజేపీ కార్యకర్తలపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, దళితులను అవమానించడం వారి అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, మండల, డివిజన్ అధ్యక్షులు, మీడియా కమిటీ చైర్మన్, అనుబంధ సంఘాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మర్రిగూడలో బిజెపి నాయకుల ముందస్తు అరెస్టు

## నల్లగొండ బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పందుల రాములు గౌడ్

మర్రిగూడ సెప్టెంబర్ 01 (హైదరాబాద్ ఎస్టేట్):

మర్రిగూడ మండల కేంద్రంలో సోమవారం రోజున బిజెపి పార్టీ రాష్ట్ర కార్యాలయం పై మరియు నల్లగొండ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బిజెపి పార్టీ నిరసన కార్యక్రమలకు పిలుపు మేరకు మర్రిగూడ మండల కేంద్రంలో బిజెపి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు ఈ సందర్భంగా నల్లగొండ బిజెపి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పందుల రాములు గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సమస్యలు పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి కార్యాలయాల పై మరియు బిజెపి నాయకుల ఇండ్ల పైన దాడులు చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు రాష్ట్రంలోని విద్యార్థులకు పెండింగ్ స్కాలర్ షిప్ లపై రాష్ట్రవ్యాప్తంగా బిజెపి పార్టీ నిరసన కార్యక్రమాలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఏమి చేయాలో అర్థం కాక బిజెపి రాష్ట్ర కార్యాలయల పైన మరియు నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఇంటి పైన కాంగ్రెస్ గుండాలు దాడి చేయడం సరి అయింది కాదని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వెనపల్లి శ్రీనివాసరావు పగడాల నగేష్ అంబాల శంకర్ జింకల లింగస్వామి మామిడి కమలాకర్ తదితరులు పాల్గొన్నారు





# కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం పట్ల హర్షం

మెదక్,సెప్టెంబర్01(హైద్రాబాద్ ఎస్టేట్): తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్జిస్ట్ జనరల్ సెక్రటరీ,మెదక్ జిల్లా ప్రెసిడెంట్ చేగుంట మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు తొడుపునూరి రాజన్న తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్గా ప్రమాణ స్వీకారం పట్ల మెదక్ జిల్లా చిన్నశంకరంపేట శ్రీ జ్యోతిర్మయి మెడికల్ అండ్ జనరల్ స్టోర్ వనం నర్సింలు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గం ఎంపిక పట్ల అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.జిల్లాలోనీ మెడికల్ షాపు యాజమాన్యుల సమస్యలను పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు.

# దళితుల భూమి అక్రమంగా దోచుకున్న ఎమ్మెల్యే మెగా రెడ్డి

**-ఎమ్మెల్యే పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి**

**-అఫిడవిటీలో తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయాలి**

**-నిరంజన్ రెడ్డి మీద మూడేళ్లుగా నిరాధారా ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణలు చెప్పాలి**

**-ఎమ్మెల్యే మెగా రెడ్డి మీద చర్యలు తీసుకోవాలని ఎస్పీ కి వినతి పత్రం సమర్పించిన బిఆర్ఎస్ నాయకులు**

హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ వనపర్తి జిల్లా ప్రతినిధి

ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే తుడి మేగా రెడ్డి నిరంజన్ రెడ్డి పైచేసిన దుష్ప్రచారాలు చేసి గెలిచారు నేటికీ మూడు సంవత్సరాలు అవుతున్న చేసిన ఆరోపణలు రుజువు చేయకపోవడంతో మెగా రెడ్డి వెంటనే ముక్కు నేలకు రాసి బహిరంగ క్షమాపణ చెప్పాలని మాజీ ఎంపీపీ కృష్ణ నాయక్ ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ దళితుల లవని పట్టను అధికారుల సహాయంతో బాజప్తా పట్టగా చేసుకుని దళితులను మోసం చేశారని, దళితులకు ప్రభుత్వాలు ఆ సెండ్ భూములకు లవని పట్టా ఇచ్చి క్రమవిక్రమాలు జరపరాదని నిబంధనలు పెట్టింది. అలాంటిది ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డుపెట్టుకొని అధికారులపై ఒత్తిడి తెచ్చి 0.39 గుంటల నిషేధిత భూమిని పట్టా చేసుకోవడం రాజ్యాంగ ఉల్లంఘన అంతే కాకుండా వెలుతురు శివారులో నేషనల్ హైవేకు దగ్గర్లో సర్వేనెంబర్ 517/ఈ 2 లో 0. 39 గుంటలో రిజిస్ట్రేషన్ చేయించుకుని రెవెన్యూ రికార్డులు పట్టా మార్పు చేయించుకున్నాడు ఇది సెక్షన్ 3 ఎస్సీ ఎస్టీ ఆక్ట్ ప్రకారం నేరం. దీనికి సహకరించిన అధికారులు, సబ్ రిజిస్టర్, తాసిల్దార్ కూడా శిక్షఅర్హులు. అదేవిధంగా అపిడబిట్ తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యే పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు



చేయడం జరిగింది. ఎమ్మెల్యేగా రెడ్డి అవినీతి అక్రమాలు రోజుకొకటి డైలీ సీరియల్ శ్రీఖ బయటపెడతం అంటూ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ నాయక్ ఎద్దుల సాయికుమార్, వసంత్, కవిత నాయక్, సర్పంచులు శోభారాజమ్మ, గోవింద నాయక్, తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ 420'పై బీఆర్ఎస్ పోరుబాట

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి సెప్టెంబర్ 1:-



ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నంలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. 'కాంగ్రెస్ 420 మోసాలపై బీఆర్ఎస్ పోరుబాట'లో భాగంగా సెప్టెంబర్ 2న ఉదయం 10 గంటలకు మార్కెట్ యార్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు 420 అడుగుల 'కాంగ్రెస్ 420 బాకీ కార్డు' ఫ్లెక్సీ ప్రదర్శనతో ర్యాలీ చేపట్టనున్నారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బంటి) పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీల అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తు చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నిరసనను విజయవంతం చేయాలని కోరారు.

# సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోలీస్ యాక్ట్ 30 అమలు

**శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పు-వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ వనపర్తి జిల్లా ప్రతినిధి వనపర్తి జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ఈ నెల 1 నుంచి 30 వరకు 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉంటుందని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, ఊరేగింపులు, భారీ సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజల సాధారణ జీవనానికి అంతరాయం కలిగించే లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలను అనుమతించబోమన్నారు. ఎలాంటి సంస్థ, సంఘం లేదా వ్యక్తి బహిరంగ కార్యక్రమం నిర్వహించాలన్నా ముందుగా సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించి అనుమతి తీసుకోవాలని సూచించారు. 30 పోలీస్ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, సామాజిక శాంతి, ప్రశాంత వాతావరణాన్ని కాపాడటమే ఈ నిబంధనల అమలు ప్రధాన ఉద్దేశమని ఎస్పీ పేర్కొన్నారు. ప్రశాంత వనపర్తి కోసం ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.




# కాంగ్రెస్ రౌడీల దాడికి నిరసనగా వనపర్తిలో బిజేపీ నిరసన



హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ వనపర్తి జిల్లా ప్రతినిధి

తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం పై కాంగ్రెస్ రౌడీలు చేసిన దాడికి నిరసనగా, వనపర్తి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న దాడి రాజకీయాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అయితే శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ ఆరోపించారు. రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ రౌడీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీజేపీ నాయకులకు మరియు పార్టీ కార్యాలయాలకు తగిన భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి దాడులతో బీజేపీ ని భయపెట్టలేదని, ప్రజాస్వామ్యబద్ధంగా తమ పోరాటం కొనసాగుతుందని నక్క మహేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# అక్టోబర్‌లో ఆర్టీసీకి 350 కొత్త బస్సులు

**-స్త్రీ శక్తి పథకానికి విశేష స్పందన -ఏడాది కాలంలో రూ.3,500 కోట్ల లబ్ది**

**-ఎపిఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు**

కడియం

ఏపీఎస్ఆర్టీసీ ద్వారా అక్టోబర్ 8 నుంచి 350 ఎలక్ట్రికల్ బస్సులు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వస్తాయని ఆర్టీసీ చైర్మన్, మచిలీపట్నం మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కడియం గౌతమి నర్సరీ అధినేత మార్గాని వీరబాబు(చైర్మన్ కొనకళ్ల వియ్యంకుడు) గృహప్రవేశ వేడుకకు మంగళవారం ఆయన విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కొత్త బస్సులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో గత ఏడాది ఆగస్టు 15 ప్రారంభమైన స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంపై విశేష స్పందన వస్తుందన్నారు.ఏడాది కాలానికి రూ.3,500 కోట్లు ఉచిత ప్రయాణం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు.ఆర్టీసి కి భారమైనప్పటికీ పేదవారు, సామాన్యులు కూడా ఈ ఉచిత బస్సును వినియోగించుకుని వాళ్ళు వెళ్లాల్సిన చోటికి వెళ్లి వస్తున్నారని వివరించారు.గతంలో బంధువులు, అయినవాళ్ల ఇళ్లకు, పుణ్యక్షేత్రాలకు వెళ్ళడానికి ఆర్థిక స్తోమత సరిపోయేది కాదన్నారు. కాని కూటమి ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా మహిళలలు చక్కగా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు. అందుకనే ఆర్టీసీ ఆక్యుఫెన్సీ 33 శాతం నుంచి ఏకంగా 68 శాతానికి పెరిగినట్లు వివరించారు. విజయనగరంలో కొత్తగా నిర్మించిన భోగాపురం ఎయిర్ పోర్ట్ కు అనుసంధానం చేస్తూ కొత్తగా 20 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అయితే ఉచిత బస్సుల వల్ల చదువుకునే విద్యార్థుల ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తున్నాయని ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య చాలా చోట్ల ఉందని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.ఈ విలేకరుల సమావేశంలో మార్గాని సోదరులు సత్యనారాయణ, ఏడుకొండలు, గోవిందు, వీరబాబు, నర్సరీ రైతులు రత్నం అయ్యప్ప, సిద్ధిరెడ్డి సత్తిబాబు, వెలుగుబంటి నాని,మార్గాని ఏడుకొండలు, మార్గాని శేషు,అడబాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.





# గుంటూరు మిర్చి యార్డ్ సందర్శించిన పెబ్బేరు కాంగ్రెస్ నాయకులు

హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ వనపర్తి జిల్లా ప్రతినిధి

వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో స్టడీ టూర్ కార్యక్రమంలో భాగంగా పాలకవర్గ సభ్యులు ఆంధ్రప్రదేశ్ జిల్లాలోని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించారు. అక్కడ మిర్చి యార్డ్ ను పరిశీలించి, రైతులకు లాభసాటిగా పంటల కొనుగోలు విధానం, ఈ-నామ్ ద్వారా వేలం వేసే పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.ఈ అధ్యయనం పెబ్బేరు మార్కెట్ అభివృద్ధికి ఉపయోగపడుతుందని మార్కెట్ వైస్ ఛైర్మన్ విజయవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ డైరెక్టర్లు మోతే రాములు,నరసింహనాయుడు,రామన్ గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు యుగంధర్ రెడ్డి,వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్ బూరమోని రాములు,భాను ప్రకాష్ రెడ్డి,సురేందర్ గౌడ్,రాములు తదితరులు పాల్గొన్నారు

# 3న చిమిడితిపాడులో కలెక్టర్ పల్లెనిద్ర

గుడ్లూరు,

జిల్లా కలెక్టర్ .పి.రాజాబాబు ఈనెల మూడవ తేదీ గురువారం సాయంత్రం గుడ్లూరు మండలంలోని చిమిడితిపాడు గ్రామంలో పల్లెనిద్ర చేస్తారు. సాయంత్రం 6:30 గంటలకు ఈ గ్రామంలో ప్రత్యేక సభ నిర్వహించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం రాత్రికి గ్రామంలోనే బస చేస్తారు. గ్రామ సభలో స్థానికులు పాల్గొని గ్రామ సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన విషయాలను తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు కలెక్టర్ రాజాబాబు పిలుపునిచ్చారు.

# ఎర్రజెండా ముసుగులో కామకీచుడు

**రామగుండం (RG-1) ఇంక్లైన్ గనిలో మహిళా కార్మికురాలిపై లైంగిక దాడి**

**గర్భం దాల్చడంతో ఆలస్యంగా వెలుగులోకి**

**ఎర్రజెండా ముసుగులో ఉన్న కీచకుడుని సింగరేణి ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించాలి**

హైదరాబాద్ ఎస్టేట్ లక్ష్మీ నారాయణ వనపర్తి

గోదావరిఖని రామగుండం =+-1 ఇంక్లైన్ గనిలో పని చేస్తున్న తోటి మహిళా కార్మికులపై ఒక అధికారి హేయమైన చర్యకు ఒడిగట్టాడు. హక్కుల కోసం పోరాడాల్సిన యూనియన్ (ూ×ఖజ ) ఎర్ర జెండా ముసుగులో ఈ కీచక అధికారి తన అసలు స్వరూపాన్ని దాచాడు. భర్తను కోల్పోయిన తోటి కార్మికురాలి అవసరాలను ఆసరాగా చేసుకుని ఆమెను కారులో హైదరాబాద్ తీసుకెళ్లి వారం రోజులపాటు బలవంతంగా గడపగా గర్భం దాల్చడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుడికి తప్పును కప్పిపుచ్చుకునేందుకు తోటి సీనియర్ ఓర్మెన్లతో ములకత్ అవుతు బాధితురాలి నోరు మూయించారని బతిమాలుకుంటూ దొరికిపోయాడు. కార్మికుల డిమాండ్లు బాధితురాలికి వెంటనే న్యాయం చేయాలి. సింగరేణి ప్రతిష్టను దెబ్బతీసిన ఓర్మెన్ ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించి సంఘం నుంచి బహిష్కరించాలి. సింగరేణి గనుల్లో పనిచేస్తున్న మహిళల కార్మికులకు యజమాన్యం పూర్తి బాధ్యత వహించాలి అంటూ మహిళ కార్మికులు డిమాండ్లను వ్యక్తం చేశారు.

